

మొంథా ధాటికి రైతుల విలవిల



చింతలమానేపల్లిలో నేలవాలిన వరి

- కోత దశలో నేలవాలిన వరి
- రంగు మారుతున్న ధాన్యం గింజ
- 50 శాతం మేర దిగుబడులు తగ్గే అవకాశం
- ముసురు, అధిక వర్షంతో తడిసిముద్దవుతున్న పత్తి
- నల్లగా మారిన పింజ, మొలకలు వస్తున్న కాయలు
- ఆందోళనలో అన్నదాతలు

మొంథా తుఫాన్ జిల్లాలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో ఎక్కువ శాతం రైతులు పత్తి, వరి పంట సాగు చేస్తున్నారు. మూ డు రోజులుగా కురిసిన వర్షాలు, గాలుల తీవ్రతకు వరి నేలవాలింది. పత్తి తడిసిపోవడంతో రంగు మారింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చింతలమానేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను ఆగమాగం చేసింది. జిల్లాలో పంటలు చేతికొచ్చే సమయంలో మూడు రోజుల పాటు తుఫాన్ ప్రభావంతో వరుస వర్షాలు, గాలుల ప్రభావంతో వరి, పత్తి పంటలు నేలపాల య్యాయి. వరి కోతకు వచ్చిన సమయంలో గాలి వాన విజృంభించడంతో పైర్లు నేలవాలి, గింజలు నేల వాలడమే కాక పంటలు నీట మునిగాయి. పత్తి, వరి పంటల పరిస్థితి మరింత దయనీయం గా మారింది. సీజన్ ఆరంభంలో వర్షాలు లేక ఎదు గుదల లేక పోవడంతో, రైతులకు పెట్టుబడులు పెరిగాయి. ఆ తర్వాత వర్షాలు కురిసినా, ఆశించిన స్థాయిలో పైర్లు ఎదగలేక దిగుబడులు తగ్గాయి. తాజాగా పండిన కొద్దీ పత్తి తీత దశలో తుఫాన్ నిండా ముంచింది. పత్తి పూర్తిగా తడిసిముద్దవడం తో భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

4.6 లక్షల ఎకరాల్లో పంటలు..

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 4.6 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందులో పత్తి పంట 3.5 లక్షల ఎకరాలు, వరి పంట 58వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు చేతికొచ్చే సమయంలో ఈ అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు దిక్కుదోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట పరిహారం అంచనా వేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గాలితో కూడిన వాన కావడంతో వరి పైర్లు ఎక్కడికక్కడ నేలవాలి కంకులు నీళ్లల్లో మునిగి నానాయి. దీంతో సగం మేర దిగుబడి కోల్పోతున్నామని, మిగిలిన పంట కోతకు సైతం రెట్టింపు వ్యయం అవుతుందని రైతులు వాపో తున్నారు. 40 బస్తాల దిగుబడి వచ్చే చోట ఎకరాకు 20 బస్తాలకు మించి దిగుబడి రాదని, పైగా వరి కోత యంత్రాలకు రెట్టింపు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి పంట నేలవాలింది..
టొంబ్రె శ్రీనివాస్, రైతు, చింతలమానేపల్లి

వరి పైరు పూర్తిగా నేలవాలింది. ఐదు ఎక రాల్లో వరి పంట సాగు చేశాను. పైరు గింజ పోసుకొని కోతకు వచ్చింది. ఇప్పటికే లక్షన్నరపైనే ఖర్చు చేశాను. 40 బస్తాల వరకు ఎకరాకు దిగు బడి వస్తుందని అనుకున్నా 20 బస్తాల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేదు. పత్తి పంటది కూడా ఇదే పరిస్థి తి. పెట్టుబడులకు వడ్డీలు కూడా వచ్చే పరిస్థితులు లేవు. ప్రభుత్వం రైతాంగా న్ని ఆదుకోవాలి. రైతులకు ఎకరా చొప్పున పంట నష్ట పరిహారం చెల్లించాలి.



అంతే కాక గింజలు కూడా రంగు మారడంతో మద్దతు ధర దక్కదని, ఈ పరిస్థితుల్లో సగా నికి పైగా నష్టపోవాల్సి వస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్షేత్ర స్థాయి లో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతాంగా నికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణం..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వగా, సీజన్ ఆరంభం నుంచే పత్తి రైతులను ఈ సారి కష్టాలు వెంటా డుతూ వచ్చాయి. సీజన్ ఆరంభంలో వర్షాలు లేక పంట ఎదుగుదల లోపించగా, పెట్టుబడులు పెరిగి పోయాయి. తీరా వరిలో కురిసిన వర్షాలతో తక్కువ దిగుబడైనా వస్తుందని అనుకున్న సమ యంలో మొంథా తుఫాన్ పత్తి రైతులను చిత్తు చేసింది. పత్తి తీత దశలో నాలుగు రోజులుగా గాలితో కూడిన వర్షాలు కురుస్తుండడం, ముసురు పట్టడంతో పూర్తి గా తడిసింది. సగానికి పైగా పత్తి తీతకు సైతం పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించగా, వర్షంతో ఆ ఆశలు కూడా నీరు గారి, నిండా మునిగారు. ఎకరాకు కనీసం రూ. 20వేల వరకు నష్టపోయినట్లేనని పత్తి రైతులు వాపోతు న్నారు. నాణ్యత లేదనే సాకుతో సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయకపోతే మద్దతు ధర రూ. 8110 కు బదులు రూ. 5,500 మించి విక్రయిం చలేమని అయినా కొనుగోలు చేసే నాథుడే ఉండడని అప్పుల పాలయినట్లేనని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, ధాన్యం కొనుగోలు చేసిన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లలో అండగా నిలవాలని పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పత్తి పంట పరిస్థితి

వర్షంతో నిండా మునిగాం..
చౌదరి సంతోష్, రైతు, కర్జెల్లి

అకాల వర్షంతో నిండా మునిగాం. నాలుగు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఎకరాకు 25వేల రూపాయల పైనే పెట్టు బడి పెట్టాను. పంటలు తీరా చేతికి వచ్చే దశలో అకాల వర్షంతో నిండా మునిగిపోయాయి. పత్తి పూర్తిగా రంగు మారింది. కాయలు నల్లబడ్డాయి. గూడలు మురిగి పోతున్నాయి. 25శాతం పంటలు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేయాలి.



ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి
ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

బెజ్జూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువా రం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన 63 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం కేంద్ర ప్రభుత్వం రెండు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షలు అందజేస్తుందని తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లులు పొందాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ఇంటి నిర్మాణాల పనుల్లో ఆలస్యం జరుగుతుందని అన్నారు. రాబోయే ఎనిమిది నెలల్లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే ఎస్టీల కోసం సీఎంతో మాట్లాడి 500 అదనంగా ఇళ్లు వచ్చేలా చూస్తానని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయని అన్నారు. రాబోయే రోజుల్లో దశల వారీగా రోడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బాపుగూడ వరకు రూ.65 లక్షలతో బీటీ రోడ్డు, వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రామ్మో హన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, నాయకులు శంకర్, తిరుపతి, భిక్షపతి, రాజారాం, బాలకృష్ణ, దిగంబర్, వశీఖాన్, దిలీప్, కార్యదర్శులు వైకుంఠం, కృష్ణమాచారి పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

బెజ్జూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీకి చెందిన పూసాల ఊర్మిళ అనే మహిళ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో గురువారం ఆమె కూతురు అంజలికి కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బాలాజీరావు, ప్రేంకుమార్, విశ్వేశ్వర్, అశోక, ప్రభాకర్ అనే మిత్రులు కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె మృతి చెందిన విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకున్న తమ గురువు పాండురంగారావు ఆదేశాలతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని అన్నారు. మృతురాలి కుటుంబానికి తాము అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. వారి వెంట స్థానికులు అమీరుద్దీన్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చింతలమానేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా ఎక్స్ రోడ్డు ధరంపల్లి గ్రామ వాసులైన చౌదరి శారదకు గురువారం సీఎంఆర్ఎఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు పంపిణీ చేశామని నాయ కులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పౌర హక్కులను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై విక్రమ్

దహెగాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పౌర హక్కులను తెలుసుకొని కాపాడుకోవాలని ఎస్సై విక్రమ్ అన్నారు. దహెగాం మండలంలోని అమర్‌గొండ గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పౌరులు అందరు సమానమేన కులాలు, మతాలు వేర్వేరుగా చూడాలన్నారు. చట్టం ముందు అందరు సమానమేననితెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నస్రుల్లా, తహసీల్దార్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

బెజ్జూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం పాపనపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదం డ్రులు గురువారం ప్రధానోపాధ్యాయుడు మధుకర్, ఉపాధ్యా యులు ఊశన్న, తిరుపతి, కమలాకర్, రాహుల్, కె.రాహుల్, జిజి యాబాయిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, బాబాజీ, గణపతి, రాకేష్, శ్రీనివాస్, బాపురావు, నాందేవ్, తిరుపతి, విలాస్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీసులు

ఆసిఫాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమర వీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని ఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రహదారి భద్రత పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం హెల్మెట్ బైక్ ర్యాలీని జిల్లా ఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై ఆసిఫా బాద్ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమర వీరుల త్యాగా లు ఎప్పటికీ మరువలేనివని చెప్పారు. వారి త్యాగస్ఫూర్తి ప్రతి పోలీసు సిబ్బందిలో నిబ ద్ధతను, ధైర్యాన్ని పెంపొంది స్తుందని అన్నారు. ర్యాలీలో జిల్లా పోలీసు అధికారులు, పోలీసులు సిబ్బంది, యువత, స్థానిక ప్రజలు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఆర్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణం లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ వహిదుద్దీన్ ప్రారంభించగా ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, క్రీడా కారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్య లో పాల్గొనందుకు డీఎస్పీ అభినందనలు తెలిపారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు, యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బస్టాం డు నుంచి ప్రారంభమై పలు వీధుల గుండా కొనసాగి పోలీసు స్టేషన్‌కు చేరు కుంది. కార్యక్రమం లో ఏఎస్సై రాములు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో రిమ్స్ ఆదిలాబాద్ సమన్వయంతో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 61 యూనిట్ల రక్తం సేకరించామని సీఐ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ అన్నారు. ఒక యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చై ర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, జైనూర్ ఎస్సై రవికుమా ర్, సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీ పీ చిర్లె లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మెస్రం రాహుల్, నా యకుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జైనూర్‌లో రక్తదానం చేస్తున్న పోలీసులు

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లింగాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంనాయక్ తండాలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని సీతారాంనాయక్ తాండా గ్రామానికి చెందిన జాదవ్ బలిరామ్ (59) అనే వ్యక్తి పురుగుల మందు తాగి అత్మహత్యా చేసుకున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. బలిరామ్ తనకు ఉన్న ఏడు ఎకరాల భూమిలో పత్తి, మొక్కజొన్న వేశాడు. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పంట దెబ్బతిన్నది. దీంతో మనస్తాపం చెంది బుధవారం మ ధ్యాహ్నం చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం వాంతులు చేసు కోవడంతో బలిరామ్ కొడుకు కుటుంబ సభ్యులకు సమాచా రం అందించాడు. కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ తరలించారు. పరిస్థితి విషమించి బలి రామ్ బుధవారం రాత్రి మృతి చెందాడు. బలిరామ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

పెంచికలపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మురళీగూడ గ్రామానికి చెందిన వెంకటేష్ గురువారం ద్విచక్ర వాహనం పై నుంచి పడి తీవ్రంగా గాయ పడ్డాడు. చెడ్వాయి గ్రామం నుంచి మురళీగూడకు వెళ్తుండగా బొంబాయిగూడ గ్రామ శివా రులోని వంతెన వద్ద కింద పడడంతో స్థానికులు 108కు సమాచారం అందించి కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



కొట్టుకుపోయిన అనార్‌పల్లి వాగుపై తాత్కాలిక వంతెన

కెరమెరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కొట్టుకు పోయింది. దీంతో వాగు అవతలి వైపు ఉన్న పెద్దకరంజీ వాడ, గోండ్‌గూడ, ఆంద్‌గూడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్, దుబ్బాపటార్, శంకర్‌లొద్ది, ఇంద్రా నగర్ గ్రామాల ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్ధాంతరం గా నిలిచి పోయిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

2కేరన్‌ను ప్రజలు విజయవంతం చేయాలి

లింగాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే 2కేరన్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై గంగన్న అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్, జాతీయ ఏకతా దివస్ కార్యాక్రమాని పురస్కరించుకుని మండలంలో పోలీసు లు మీకోసంలో భాగంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండంలోని యువత సామాజిక కార్యాకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

విద్యా సంస్థల బంద్ సంపూర్ణం

రెబ్బెన, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని తలపెట్టిన కళాశాలల బంద్ మండలం లో సంపూర్ణంగా ముగిసింది. కార్యక్రమం లో డీవైఎఫ్ఐ నాయకులు పురుషోత్తం, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ప్రయాణానికి అవస్థలు



గుంతలమయంగా మారిన వారసంత రోడ్డు

వాంకిడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు వెళ్లే రహదారిపై గుంతలు పడడంతో రాకపోక లకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి గురువారం ఇక్కడ వారసంత జరుగుతోంది. మండలంలోని వివిద గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు నిత్యవసర సరకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. సంతకువెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రు. జాతీయ రహదారి నుంచి సంత వరకు మట్టి రోడ్డు ఉండడంతో వర్షాకాలం రహదారి బురదమయమై, గుంతలు పడి నడవలేని స్థితిలో ఉంటుంది. గురువారం జరిగే సంతకు వాంకిడి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని రాజుర, బల్లార్షా, చంద్రపూర్ నుంచి వ్యాపారులు సరుకులు తీసుకుని వస్తుంటారు. సంతకు వెళ్లే దారి సరిగా లేకపో వడంతో సంత వరకు వాహనాలు తీసుకువెళ్లలేని పరిస్థితి ఉందని వ్యాపారులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం సంతకు దాదాపు 9 లక్షల వరకు ఆదాయం సమకూ రుతున్నా అధికారులు కనీసం రోడ్డు సౌకర్యం క ల్పించకపోవడంపై ప్రజలు, వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధి కారులు సంత వరకు సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కాగజ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ అటవీ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ కోసిని తదితర గ్రామాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉందన్నారు. మూకుమ్మడిగా అడవి పందులు పంటలపై దాడి చేసి తీవ్రంగా నష్టం చేస్తున్నాయని చెప్పారు. అధికారులు సర్వేలు చేసి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అడవి పందిని చంపిన నిందితుల పట్టివేత

బెజ్జూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అడవి పందిని చంపిన కేసులో నిందితులను పట్టుకున్నామని అటవీ శాఖాధికారులు తెలిపారు. ఈ నెల 20న తలాయి ప్రాణహిత తీరం నుంచి అడవి పంది మాంసాన్ని తరలిస్తుండగా అటవీ అధికారులు పట్టుకుని తలాయి, పాపన్నపేట గ్రామాలకు చెందిన ఎనిమిది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అడవి పందిని చంపిన ఘటనలో ఆసిఫాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్, వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ టీం అధికారులు లోతైన విచారణ జరపగా మహారాష్ట్రలోని దేవలమర్రి గ్రామానికి చెందిన దందెర అనిల్, ఇసాన్కర్ తిరుపతి అనే వ్యక్తులు అడవి పదిని చంపినట్లు విచారణలో తేలిందని బెజ్జూరు రేంజ్ అధికారి ముసావీర్ తెలిపారు. నిందితుల ఇద్దరి నుంచి వివరాలు సేకరించగా తామే మహారాష్ట్రలో దేవలమరిర గ్రామ సమీపంలోని పంట చేలలో ఉచ్చులు బిగించి అడవి పందిని చంపి మాంసాన్ని అమ్మినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. దీంతో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులను మహారాష్ట్రలోని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు రేంజ్ అధికారులు తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప స్వాధీనం

దండేపల్లి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట అటవీ రెంజ్ పరిధిలోని కొత్త మామిడిపల్లిలో లడ్డు ఆలియాస్ గనిశెట్టి కార్తీక్ ఇంటిపై అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు హంటర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఇంట్లో నిల్వ ఉంచిన ఎనిమిది టేకు కలప దుంగలను పట్టుకున్నట్లు తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఎఫ్‌బీవో అనిల్ డాగ్ స్క్వాడ్ హంటర్‌లో కలిసి బృందం అ ఇంటిపై దాడులు చేయగా ఇంట్లో నిల్వలో ఉన్న ఎనిమిది టేకు దుంగలు లభ్యమయ్యాయి. దీని విలువ సుమారు రూ. 33,606 ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో సుష్మరావు వెల్లడించారు. దాడిలో ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

4న టోంకినికి మహా పాదయాత్ర

- కాగజ్‌నగర్ నుంచి సిద్ధిహనుమాన్ ఆలయానికి చేరుకోనున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు
- కార్తీకమాసంలో ఏటా నిర్వహణ

సిర్పూర్(టి), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండలం టోంకిని సిద్ధిహనుమాన్ ఆలయం వరకు భక్తులు నవంబరు 4న 24వ మహాపాదయాత్రకు చేపట్టనున్నారు. కార్తీక మాసంలో ఆలయంలో ఏటా జాతరతో పాటు కాగజ్‌నగర్ పట్టణం నుంచి మహాపాదయాత్ర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇందుకుగానూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు, కమిటీ సభ్యుడు మారుతి తెలిపారు. మండలంలోని టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలోని స్వామి వారికి దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు ఏటా ఆలయానికి పాదయాత్రగా వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులు కోరుకున్న మొక్కు లు తీరుతాయనే విశ్వాసంతో పాదయాత్రగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.

మహారాష్ట్రలోని పలు గ్రామాల నుంచి..

సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూరు, దహెగాం, రెబ్బెన, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ మండలాలతో పాటు మహా రాష్ట్రలోని పోడ్సా, అన్సూర్, అంతర్‌గాం, గోండ్ పిప్రి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయా నికి చేరుకుని ఆలయ సమీపంలోని పెన్‌గంగాలో స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి స్తుంటారు. కార్తీక మాసంలో ప్రత్యే కంగా ఇక్కడ నుండే హనుమాన్ మాలధారణ చేయడంతో పాటు హనుమాన్ భక్తులు ఆలయంలోనే ఉండి ప్రత్యేక పూజలు చేస్తారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు ఆలయంలో ప్రత్యేక అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో ఆ రోజు మండల కేంద్రంలో పండగ వాతా వరణం నెల కొంటుంది. కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై పాదయాత్రగా వచ్చే భక్తులకు పాలు, పండ్లు, ఫలహారాలు అందజేస్తారు. మహాపాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఆలయ కమిటీతో పాటు సిర్పూర్ (టి), కాగజ్‌నగర్, కౌటాల, తదితర ప్రాంతాలలోని వ్యాపారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో తాగు నీరు, పాలు, పండ్లు, ఫలహారాల పంపి ణీకి రహదారి మధ్యలో ఏర్పాట్లు చేస్తున్నారు. సిర్పూర్(టి) మండలంలోని వెంపల్లి గ్రామం నుంచి వేంపల్లి రైల్వే గేటు, అటవీ ప్రాంతంలోని భీమన్న ఆలయం, పెద్దబండ గ్రామ సమీపంలో, మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాల యం, పెట్రోల్ పంపు, బెస్తకాలనీ, మేషన్ కాలనీ, ఎస్సీ కాలనీ, బస్టాండు, డౌనల్ ఏరియా, మధ్య వాగు ప్రాంతాలతో పాటు దారి పొడవున భక్తులకు పాలు, పండ్లు, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



స్వామివారు



టోంకినిలోని సిద్ధిహనుమాన్ ఆలయం

అయ్యప్ప ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

ఆసిఫాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ అర్చకుడు నాగేశ్వర్ శర్మ గురువారం తెలిపారు. అర్చకుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు వారీగా గురువారం ఉదయం పూజలు నిర్వహించడానికి ఆలయంకు చేరుకున్నారు. గర్భగుడి ద్వారం ముందు ఏర్పాటు చేసిన హుండి పై భాగం కట్ చేసి ఉండడాన్ని గమనించారు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంకు చేరుకన్న పోలీసులు ఆలయ ఆవరణను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి హుండీని తెరువలేదని గతంలో కూడా దుండగులు చొరబడి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారని ఆలయ అర్చకుడు తెలిపారు. ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న భక్తులు అక్కడికి చేరుకున్నారు. చోరీ లు పునరావృతంకాకుండా అధికారులు, చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

పాఠశాలలకు సైన్స్ కిట్లు పంపిణీ



సైన్స్ కిట్‌ను అందజేస్తున్న డ్రీమ్ ట్రస్ట్ సభ్యులు

ఆసిఫాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్స్ పంపిణీ చేస్తామన్నారు. కేరీర్ గైడెన్స్, జీవన నైపుణ్యాల శిక్షణతో పాటు ఉపాధ్యా యులకు ప్రయోగ బోధనలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి మాట్లాడుతూ పాఠశాలలకు సైన్స్ కిట్స్ అందించడమే కాకుండా ఉపాధ్యాయులు వాటి వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్య క్రమం కూడా నిర్వహించనున్నామని తెలి పారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ అకౌంట్స్ అధికారి దేవాజీ, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

గుడుంబా నిషేధానికి యువకుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు, గ్రామస్థులు

పెంచికలపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో గురువారం యువకులు గుడుంబాను పూర్తిగా గ్రామంలో నిషేధిస్తున్నామని తీర్మానించి ప్రతిజ్ఞ చేశారు. ఇకపై గ్రామంలో గుడుంబా తయారు చేయడం, అమ్మడం, రవాణా చేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని అన్నారు. గుడుంబాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్ట పోతూ మానసికంగా విచ్ఛిన్నమవుతున్నాయని దృష్టిలో ఉంచుకొని గ్రామ యువత అంతా ఏకమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

హాజీపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహ నాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం పట్టుబడ్డ వారిని లక్సెట్టిపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రే ట్ కోర్టులో హాజరు పరచేందుకు కోర్టుకు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కోర్టులు జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, రవాణాశాఖ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు.

దివ్యాంగులకు ఉపకారం

- దరఖాస్తుకు నేటితో ముగియనున్న గడువు

వాంకిడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన విద్యార్థులకు చేయూత అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రతి విద్యా సంవత్సరం దరఖాస్తులు స్వీకరిస్తు అర్హులను ఎంపిక చేస్తుంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు గడువు శుక్రవారం ముగియనుంది. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 9,10 తరగతులు చదువుతున్న వారికి ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరు చేస్తారు. వసతి గృహ విద్యార్థులకు నెలకు రూ. 800, మిగతా వారికి రూ.500 చొప్పున అందుతుంది. దీంతో పాటు అందులైన వారికి ఏడాదికి రూ. 4 వేలు, చొప్పున డిజేబిలిటీ అలవెన్సు పేరుతో అదనంగా అందిస్తారు. పుస్తకాల కోసం ఏడాదికి మరో రూ. వెయ్యి మంజూరు చేస్తారు.

ఇంటర్ ఆపై చదువులకు..

ఇంటర్, ఆపై చదువుల వారికి బోధనా రుసుం, ఉపకార వేతనాలు మంజూరు చేస్తారు. ఏడాదికి రూ. 1.90 లక్షలు అందుతుంది. కోర్సును బట్టి ట్యూషన్ ఫీజును నిర్ణయిస్తారు. గ్రంథాలయ, క్రీడలు, వైద్య పరీక్షలు తదితరాల కోసం ఏడాదికి రూ. 10 వేలు ఉపకార వేతనాల కింద వసతిగృహ విద్యార్థులకు నెలకు రూ. 1200 డే స్కాలర్ వారికి రూ. 650 చొప్పున అందుతుంది. అందులకు రూ. 4 వేలు ఇతర దివ్యాంగులకు రూ. 2 వేలు ఏడాది కి అదనంగా అందజేస్తారు. కేంద్ర సామాజిక న్యాయం, దివ్యాంగుల సాధికారత శాఖ ద్వారా దివ్యాంగ విద్యార్థులకు చేయూతనిచ్చే పథకాన్ని అమలు చేస్తున్నారు. వివరాలకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో సంప్రదించాలి. వివరాలను హెచ్‌టీటీపీఎస్://స్కాలర్‌షిప్. గౌట్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.

సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు అన్ని రంగాల్లో విఫలమయ్యాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. గురువారం మందమర్రిలోని కేకే ఓసీలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సింగరేణిలో ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే రెండు సంఘాలు పైరవీలకే పరిమితమ య్యాయన్నారు. సింగరేణిలో కార్మిక గుర్తింపు సంగం ఎన్నికలకు ముందు కార్మికులకు సొంతింటికళ నెరవేరుస్తామని, మారుపేర్లు మార్పు చేస్తామని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు చేస్తామని గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ హామీ ఇచ్చిందన్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడ పరిష్కరించలేదన్నా రు. అంతేగాకుండా రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉందని, కార్మికులకు సొంతింటి కళ నెరవేరుస్తామని, నూతన గనులు నెరవేరుస్తామని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు చేస్తామని చెప్పిన ఐఎన్‌టీయూసీ కూడ ఏ ఒక్కటి పరిష్కరించిందా అని ప్రశ్నించారు. ఈ రెండు సంఘాలకు వారి ప్రయోజ నాలు తప్ప ఉద్యోగుల ప్రయోజనాలు అక్కరలేదన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిలో కార్మికులు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఒక్కో కార్మికులు అనారోగ్యంతో మెడికల్‌బోర్డుకు వెళితే అన్‌ఫిట్ చేసి ఏడు నుంచి ఎనిమిది నెలల తర్వాత ఫిట్ చేస్తున్నారని ఎనిమిది నెలల వేతనాలు ఉద్యోగులకు ఎవరిస్తామని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్నటువంటి సమస్యల సాధన కోసం తమ యూనియన్ ఎలాంటి త్యాగాలకైన సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేందర్, లింగాల రమేశ్, వడ్ల కొండ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు



రోగులతో మాట్లాడుతున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు వారి కుటుంబీకులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, ఆ దిశగా సింగరేణి వ్యాప్తంగా అన్ని వైద్యశాలల్లో సేవలందిస్తున్నామని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం మందమర్రి ఏరియాలోని రామకృష్ణపూర్ ఏరియాఆసుపత్రిని ఆయన సందర్శించారు. వార్డుల్లోకి వెళ్లి రోగులను వైద్య సేవల గురించి , నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు రోగుల మానసిక స్థితి గతులను అర్థం చేసుకుని వైద్యం అందించాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఆసుపత్రులను సింగరేణి సీఎండీ బలరాంతో పాటు డైరెక్టర్ పొట్రు ఆదేశాల ప్రకారం పరిశీలిస్తున్నామని చెప్పారు. వైద్యశాలల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యులు పట్ల విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. సింగరేణి కార్మికులు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుకుమార్, వైద్యులు ఉన్నారు.

ఎస్‌వోటూ జీఎం సేవలు అభినందనీయం

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా అభివృద్ధికి సేవలందించిన ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్ అందరికి ఆదర్శమని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ తెలిపారు. అడిషనల్ జీఎంగా కొత్తగూడెం కార్పోరేట్ హెచ్‌ఆర్‌డీకి బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం స్థానిక జీఎం కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ ప్రతి అధికారికి బదిలీలు సహజమని తెలిపారు. ఎక్కడకు వెళ్లినా మంచి సేవలందించాలన్నారు. ఈసందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సేఫ్టీ జీఎం రఘుకుమార్, పీఎం శ్యాంసుందర్, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేసి.. చెత్తాచెదారం తొలగించి..



ముళ్ల పొదళ్లను తొలగిస్తున్న జీఎం, సింగరేణి ఉద్యోగులు

రెబ్బెన, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం గోలేటిలోని మురుగు నీటి శుద్ధి కేంద్రం, డంప్ యార్డు పరిసరాల్లో స్వచ్ఛత కోసం శ్రమదానం చేసి చెత్తాచెదారం తొలగించారు. రెండు గంటల పాటు జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఏరియా అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయం ఉద్యోగులతో కలిసి ముళ్ల పోదళ్లు, చెత్త, గడ్డిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. జీఎం విజయభాస్కర్‌రెడి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం చేసే శ్రమలో ఆనందం ఉంటుందని చెప్పారు. శ్రమతో శారీరక వ్యాయమంతో పాటు పరిసరాలు శుభ్ర పడుతాయని తెలిపారు. సొంత లాభం కోసం చేస్తే స్వార్థం అనిపించుకుంటుందని తోటి వారి శ్రేయస్సు కోసం చేప కర్మ ఇరువురికి సమాజానికి ప్రయోజనాన్ని కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్‌కుమార్ బెహెర, అధికారులు మదీనాబాషా, శ్రీధర్, రవికుమార్, హరీష్, శ్రీనివాస్, ప్రశాంత్, రాజేంద్రప్రసాద్, ముజీబ్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగం చేస్తూ పట్టుదలతో గ్రూపు-2 కొలువు సాధించిన ఉద్యోగిని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి గురువారం గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో సన్మానిం చారు. జీఎం కార్యాలయంలో పర్చేస్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజ్జగిరి సతీష్ సెక్రెటేరియేట్‌లో ఏఎస్‌ఓ కొలువు సాధించాడు. గోలేటిలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సమీప గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో పర్చేస్ అధికారి రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ స్పందన, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



అవినీతి రహిత సంస్థే ధ్యేయం



మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని అవినీతి రహిత సంస్థే ధ్యేయంగా ఉద్యోగులు పని చేస్తున్నారని జీఎం రాధాకృష్ణ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎంవీటీసీ లో మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజిలెన్స్‌పై అధికారులు, ఉద్యోగుల్లో అవగాహన పెరిగిందన్నారు. రాజ్యాంగంలోని హక్కులను ప్రతి పౌరుడు పొందవచ్చని, లంచం ఇస్తేనే పనులు జరుగుతాయనే పద్ధతి మంచిది కాదన్నారు. అవినీతి రహిత సంస్థే ధ్యేయంగా అందరు పనిచేస్తున్నారన్నారు. ఎవరైనా అవినీతి పరులు ఉంటే వారి సమాచారాన్ని సింగరేణి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ వెంకన్న ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. కార్మికులకు సంబంధించిన పనులను నిజాయితీతో చేయాలని సూచించారు. సింగరేణి సంస్థ అవినీతి రహిత సంస్థగా ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిపేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గెస్ట్‌లెక్చరర్ ఆన్ విజలెన్స్ అవర్నెస్ కిశోర్ బగాడియో, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ జీఎంలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏరియా రక్షణాధికారి భూశంకరయ్య

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు, వారి కుటుంబీకులు సైబర్‌మోసాలపై అవగాహన పెంచుకోవాలని మందమర్రి ఏరియా రక్షణాధికారి భూశంకరయ్య అన్నారు. స్థానిక ఎంవీటీసీ కార్యాలయంలో గురువారం సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. కొన్ని సార్లు మనకు తెలియకుండా డబ్బులు ఖాతాలో నుంచి పోతాయని, వెంటనే సైబర్ హెల్ప్‌లైన్‌కు కానీ, పోలీసులకు కానీ సమాచారం అందించాలని చెప్పారు. . కష్టపడి సంపాదించిన డబ్బులను సైబర్ మోసాల్లో పోగొట్టుకోవద్దని తెలిపారు. అందువల్లే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం సైబర్ మోసాలపై క్విజ్ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీవైజీఎం ఐటీ కార్పోరేట్ శ్రీనివాసరావు, డీవైసీఐ ఎస్ఈ నారాయణ పర్ణవేష్, ఎంవీటీసీ మేనేజర్‌శంకర్, అధికారులు రవి, అశోక్ పాల్గొన్నారు.

నేలవాలిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

పొంచి ఉంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరదనీరు చేరుతోంది. గేట్లు తెరిచి నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలు ఇలాగే కొనసాగితే గోదావరి ఉగ్రరూపం దాల్చి జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, రాంనగర్, పద్మశాలి కాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్ ఏరియాలోని ఇళ్లలోకి వరదనీరు చేరే అవకాశాలు ఉన్నాయి.

మూడు వేల ఎకరాల్లో పంట నష్టం...

రెండు రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని రైతులకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లాలోని 128 గ్రామాల్లోని 2,751 మంది రైతులకు చెందిన వరి, పత్తి పంటలు 3,351 ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇందులో 2,563 ఎకరాల్లో వరి పంట నీట మునగగా, 788 ఎకరా పత్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

● నేలవాలిన వరి..తడిసిన పత్తి..

చెన్నూరు: అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఓత్కులపల్లి, ఎర్రగుంటపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, లింగంపల్లి, కొమ్మెర, పొక్కూరు గ్రామాల్లో చేనులో ఉన్న పత్తి పంట తడిసిపోయి నల్లబారుతుంది. అలాగే నాగాపూర్, అక్కెపల్లి, చింతలపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో వరి పంట వర్షాలకు నేలకొరిగింది. సుమారు వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

జైపూర్: తుఫాన్ దృష్ట్యా మండలంలో రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మండల కేంద్రంతో పాటు నర్వా, ముదిగుంట, ఇందారం, రసూల్‌పల్లి, మిట్టపల్లి, రామారావుపేట, టేకుమట్ల, శెట్‌పల్లి, ఇందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూరు, శివ్వారం గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. పత్తి తడిసి ముద్ద అయ్యింది. పత్తి రంగు మారే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నీరునిలిచి చెరువులను తలపిస్తున్నాయి. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. అధికారులు స్పందించి పంట నష్టం సర్వే చేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

బెల్లంపల్లి: పట్టణంతో పాటు మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో చేతికి వచ్చిన పత్తి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. అలాగే పట్టణంలోని పలు రహదారుల పైనుంచి వరదనీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డులోని మహ్మద్ ఖాసీం బస్తీలో వర్షాల కారణంగా నాగమల్ల సోమయ్య ఇంటి పైకప్పు కూలింది. కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే వినోద్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

హాజీపూర్/భీమారం: హాజీపూర్, భీమారం మండలాల్లో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పంటలు నేలవాలాయి. మడుల్లో నీరు చేరడంతో పైరు కింద పడడంతో వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి నెలకొంది. పత్తి ఏరే దశలో ఉండడంతో వర్షాలకు నేల రాలుతోంది. అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలకు ఇప్పటికే వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నామని, ఇక తుపాను తెచ్చిన నష్టంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామని, నష్టపోయిన పంటలను అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పంట నష్టం అంచనా



పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

జన్నారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షానికి నష్టపోయిన పంటలను ఏవో సంగీత గురువారం అంచనా వేశారు. మండలంలోని కలమడుగు, కవ్వాలతో పాటు పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. భారీ వర్షం కురవడంతో వరి అత్యధికంగా ఒరిగిపోయింది. పంట నష్టాన్ని అంచనా వేసి పైఅధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఏవో తెలిపారు.

చకచకా..గ్రీన్‌ఫీల్డ్

● వేగంగా మంచిర్యాల-వరంగల్-విజయవాడ హైవే పనులు

● నాలుగు రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగు

● మారనున్న జైపూర్ రూపురేఖలు



కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు

జైపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల- వరంగల్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో వేగం పుంజుకుంది. నాలుగు వరుసల రోడ్డు పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఒక వైపు 63వ నంబరు జాతీయ రహదారి, మరో వైపు హైద్రాబాద్ రాజీవ్ రహదారి రెండు ప్రధాన రహదారులను కలుపుకుని కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం చేపట్టడంతో జైపూర్ రూపురేఖలు పూర్తిగా మారను న్నాయి. మంచిర్యాల జిల్లా రసూల్‌పల్లి కేంద్రంగా రింగ్ రోడ్డుతో కొత్త హైవే రోడ్డు ప్రారంభం కానుం డగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడ నుంది. భారతదేశానికి సెంటర్ పాయింట్‌గా ఉన్న నాగ్‌పూర్ నుంచి దక్షిణాది రాష్ట్రాలకు సరుకుల ట్రాన్స్‌పోర్టు సౌలభ్యం సులభతరం కావడంతో పాటు దూర, సమయ భావం కలిసి రానుంది.

హైవేతో కొత్త కళ...

ఇప్పటికే జైపూర్ పారిశ్రామికంగా చాలా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ సింగరేణి సంస్థ 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పగా దానిని విస్తరిస్తూ మరో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేస్తుంది. జైపూర్ మండలానికి ఒక వైపు జాతీయ రహదారి, మరో వైపు రాజీవ్ రహదారి ఉండగా కొత్తగా నిర్మించనున్న వరంగల్-విజయవాడ హైవేతో కొత్త కళ సంతరించుకోనుంది. భవిష్యత్‌లో ఈ ప్రాంతం పట్టణంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉండడంతో ఇక్కడి భూములు కొనుగోలు చేసేందుకు ప్రజలు, వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒక ఎకరాకు కోటి రూపాయలకు పైగానే ధర పలుకుతోంది.

110 కిలోమీటర్లు...రూ. 3440 కోట్లు..

మంచిర్యాల జిల్లా నుంచి వరంగల్ -విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ నాలుగు వరుసల ఎన్‌హెచ్-163జీ రహదారి నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు పడనుంది. జైపూర్ మండలం రసూల్‌పల్లి కేంద్రంగా ప్రారంభమైన కొత్త హైవే రోడ్డు ఎల్కంటి, టేకుమట్ల, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్ మీదుగా గోదావరి నదిపై నుంచి పెద్దపల్లి జిల్లా మంథని, భూపాలపల్లి జిల్లా మేదరిమెట్ల నుంచి వరంగల్ జిల్లా ఉరుగొండ, నెక్కొండ, జనగామ జిల్లా ఆలేరు, పెరుమాండ్ల నుంచి ఖమ్మం మీదుగా విజయవాడ వెళ్లనుంది. 3,440 కోట్ల రూపాయలతో మొత్తం 110 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 22 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో 50కి పైగా చిన్న బ్రిడ్జీలు, ఏడు పెద్ద బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ఇప్పటికే జిల్లాలోని పార్వతి బ్యారేజీ (కిష్టాపూర్) వద్ద భారీ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో రోడ్డు గ్రౌండ్ వర్క్ చకచకా జరుగుతుంది. నాలుగు వరుసలతో 12 నుంచి 14 ఫీట్ల ఎత్తులో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మిస్తున్నారు. నర్సింగాపూర్, వేలాల మీదుగా ఇంటర్ చేంజ్ (రోడ్డు ఎక్కడం, దిగడం) కోసం నిర్మాణాలు సాగుతున్నాయి.

ఎంపీడీవోకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

మందమర్రిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వేతనాలు తగ్గించి ఇవ్వడం బాధకరమని ఫీల్డ్ అసిస్టెంట్‌లు పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. సారంగపల్లిఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ. 1301, శంకర్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ. 1011 తగ్గించి ఇచ్చారన్నారు. తమకు తెలియకుండా వేతనాల్లో కోత విధించడం బాధకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి వేతనం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఈద లింగయ్య, రాజేందర్, శంకరయ్య, బాపు, జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి సంస్మరణ సభ

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణానికి చెందిన బీజేపీ సీనియ ర్ నాయకుడు వెలుముల జగన్నాథ్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం బీజేపీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు పురుషోత్తం జాజు, వెంకటేశ్వర్‌రావు, మధు, తిరుపతి, శ్రీదర్, రామన్న, నాగేశ్వర్ రావు, రాకేష్ రెన్వా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బెల్లంపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు కాల్‌టెక్స్ ఏరియాలో మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు.

ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే నిధులతో రోడ్డు నిర్మాణాలు చేపట్టి కాల్‌టెక్స్ ఏరియాను అభివృద్ధి పరుస్తామని ఆమె తెలిపారు. ఏరియాలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌స్వామి, నెల్లి సమ్మయ్య, ఉప్పుల శంకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అవినీతికి పాల్పడితే చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చీఫ్ విజిలెన్స్ అధికారి శశిధర్ రాజు హెచ్చరించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2024-25 రబీ సీజన్ ధాన్యం కొనుగోలులో జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో నిర్వహకులతో పాటు అవకతవకల్లో బాగస్వాములైన వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. రామారావుపేట గ్రామంలోని సముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, ఎనిమిది మంది రైతులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లపై రాష్ట్ర పౌరసరఫరాల కమిషన్ స్టీఫెన్ రవీంద్ర, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ విజిలెన్స్ అధికారి శశిధర్ రాజు

జిల్లాలో 6,322.6 క్వింటాళ్ల ధాన్యంను ఎనిమిది మంది రైతుల నుంచి కొనుగోలు చేసి కోటి39 లక్షల రూపాయలను జమ చేసినట్లుగా ఆన్‌లైన్ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంలో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారనానరు. వీటితో పాటు రవాణా ఖర్చుల కింద రూ. 1.90 లక్షలు ట్రక్ చిట్టీలు సృష్టించి నమోదు శారని తెలిపారు. వీరిపై జైపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల రక్షణ చట్టం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులకు రక్షణ చట్టం చేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మదర్ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాలలోని చార్వాక హాలులో జరిగిన సంఘం 25 వ వార్షికోత్సవ సభకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా రజక వృత్తి మీద ఆధారపడి ఉన్నారని, వీరు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. రజకులపై గ్రామాల్లో కుల వివక్షత, సామాజిక దాడులు, దౌర్జన్యాలు పెత్తందారులతో జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి రక్షణ చట్టం చేయాలన్నారు. కేంద్రం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని, జిల్లాలో మోడ్రన్ ధోబీఘాట్‌లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్, ప్రకాష్, తిరుపతి, కళావతి, సందీప్, సది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శ్రీరాంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా స్థానిక వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. క్రిష్ణకాలనీలో పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి స్థానిక యువకులకు అవగాహన కల్పించారు. పొగాకును వినియోగించవద్దని సూచించారు. ఆర్‌కే 6 సబ్ సెంటర్ వద్ద మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారికి అవసరమైన పరీక్షలు చేసి మందులు, తగిన సూచనలు ఇచ్చారు. అలాగే అరుణక్కనగర్ సబ్ సెంటర్ పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మందులు, సలహాలు, సూచనలు అందించారు. ఆయా శిబిరాల్లో స్థానిక వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గోదావరి నదిలో దూకి యువకుడి ఆత్మహత్య

దండేపల్లి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం వద్ద గోదావరి నదిలో దూకి గోళ్ల రవిందర్(35) అనే యువకుడు ఆత్యహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై ఎండీ తహసీనోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన గోళ్ల రవిందర్ మంచిర్యాల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అతనికి మానసికస్థితి బాగలేకపోవడంతో తన భార్య, తల్లి కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తరుచూ తాను చనిపోతా అంటూ కుటుంబసభ్యులతో తెలిపేవాడు. రవిందర్ మానసిక స్థితిపై వైద్యులతో చికిత్స చేయించారు. గురువారం ఉదయం రవిందర్ భార్య, తల్లి కూరగాయలు విక్రయించడానికి వెళ్లారు. ఈ క్రమంలో రవిందర్ మధ్యాహ్నం సమయంలో దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వంతెనపై తన బైక్‌ను ఉంచి నదిలో దూకాడు. మృతుడు రవిందర్ భార్య గోళ్ల సుమలత ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ పేరుతో వేధించిన యువకుడి అరెస్టు

కోటపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్న ఆలుగామ గ్రామానికి చెందిన అంబాల సాయికుమార్ అనే యువకుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. యువతిని బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తూ గ్రామంలో పోస్టర్లు అంటించాడన్నారు. యువతి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీపీఎంఆర్‌ఎస్ మెడికల్ కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి విశాంత్ర బొగ్గు పెన్షనర్‌లకు నవంబరు నెలలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కోసం సీఎంపీఎఫ్ అధికారులు ఏరియాల వారీగా చేపట్టే స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో సీపీఎంఆర్‌ఎస్ మెడికల్ కార్డులను కూడా ఇవ్వాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వారు గురువారం మాట్లాడుతూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌తో పాటు సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డులను కూడా రెన్యువల్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు అంజన్న, రాజేశం, బిక్షపతి, లింగయ్య, సుధీర్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి 'కాంపెల్లి'కి ఇవ్వాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి సీనియర్ నాయకుడు కాంపెల్లి సమ్మయ్యకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా పట్టణ, నాయకులు వాసాల సంపత్, తుంగపిండి శంకర్, దాసరి రాజనర్సు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పార్టీ కోసం పని చేసిన నాయకుడు కాంపెల్లి సమ్మయ్య ఒకరని అన్నారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన ఆయనకు ఇవ్వడం పార్టీకి మేలు జరుగుతుందని తెలిపారు. నాయకులు వేల్పుల కిరణ్, శంకర్, ముల్కల్ల రమేష్, రవి, ఓదెలు పాల్గొన్నారు.

అప్పు తిరిగి చెల్లించడం లేదని సెల్ టవర్ ఎక్కిన రైతు

కాసిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురైన రైతు గురువారం సాయంత్రం కొండాపూర్ యాప వద్ద ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీంతో దేవాపూర్ పోలీసులు అక్కడకు చేరుకుని బాధిత రైతుతో మాట్లాడి డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో బాధిత రైతు కిందకు దిగాడు. దీంతో రెండు గంటల పాటు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ సందర్భంగా బాధితుడు జనార్దన్ మాట్లాడుతూ మంచిర్యాల ఫారెస్టు డివిజ న్ పరిధిలోని దేవాపూర్ ఫారెస్టు రేంజ్‌లో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహి స్తున్న గబ్బర్ లతకు 2018లో రూ. 2.50 లక్షలు అప్పుగా ఇచ్చానన్నారు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. దీంతో మూడేళ్ల క్రితం బెల్లంపల్లి కోర్టును ఆశ్రయించగా ఆరు శాతం వడ్డీ కలిపి డబ్బులు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. లతను ఎన్నిసార్లు డబ్బులు అడిగినా ఇవ్వడం లేదన్నారు. జీవితంపై విరక్తి చెంది సెల్ టవర్ ఎక్కానన్నాడు. మూడు రోజుల్లోగా డబ్బులు ఇప్పిస్తామని ఎస్‌ఐ గంగారాం హామీ ఇవ్వడంతో జనార్దన్ కిందకు వచ్చాడు. దీంతో ఉత్కంఠకు తెరపడింది.

బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల మధ్య ఘర్షణ

లక్షెట్టిపేట, అక్టోబరు, 30(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడగా ఓ విద్యార్థి గాయపడిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే కార్తీక్ అనే విద్యార్థి వసతిగృహంలో ఉంటూ స్థానిక సీఎస్ఐ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 29న రాత్రి భోజనం చేసే సమయంలో ఇదే వసతిగృహంలో ఉండే చరణ్ అనే విద్యార్థికి కార్తీక్‌కు గొడవ జరిగినట్లు సమాచారం. ఇద్దరు గొడవపడి ఒకరికొకరు నెట్టుకోవడంతో కార్తీక్ తలకు డోర్ తగిలి తీవ్రంగా రక్తం కారింది. వార్డెన్ కార్తీక్‌ను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు తలకు సుమారు ఐదు కుట్లు వేశారు. ఈ విషయమై వసతిగృహం హెచ్ డబ్ల్యూవో కేజియా రాణిని వివరణ కోరగా గొడవ ఏమీ జరగలేదని పిల్లలు తినే సమయంలో నెట్టుకోవడంతో కార్తీక్ అనే వ్యక్తికి గాయం అయినట్లు తెలిపారు.

ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ఎన్నిక

కన్నెపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఐద నరేష్, రాంమోహన్, మల్లేష్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, కోశాధికారిగా రాజబాబు, సహాయ కార్యదర్శిగా శివరాం, ప్రచార కార్యదర్శిగా రాజు, సంస్కృతి కార్యదర్శిగా రాజన్న, నాందేవ్, సభ్యులుగా లక్ష్మీ, చంద్రకళ, శకుంతల, రఘు ఎన్నికయ్యారు.

రేషన్ కార్డుదారులకు నాన్ ఓవెన్ సంచి పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ కార్డుదారులకు నవంబర్ 1 నుంచి నాన్ ఓవెన్ సంచులు అందిస్తామని అదనపు కలెక్టర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కోసం ఒక వేలిముద్ర, సంచి కోసం మరో వేలిముద్ర వేయాలన్నారు. ఏ రేషన్ షాపులో కార్డు ఉందో అక్కడే సంచి అందిస్తామని, పోర్టబులిటి ద్వారా ఇతర షాపుల్లో బియ్యం పొందే వారికి సంచి ఇవ్వబడదని తెలిపారు.

లంచావతారులపై ఏసీబీ కొరడా

● పది నెలల్లో 19 మంది పట్టుబడ్డ అధికారులు

● కొత్తగా ఆఫీసు ఏర్పడిన తర్వాత 13 కేసులు నమోదు



పది నెలల్లో 19 కేసులు..

గడిచిన పది నెలల్లో లంచం తీసుకుంటూ అవినీతి అధికారులకు 19 మంది పట్టుబడ్డారు. ఆదిలాబాద్‌లో 6, నిర్మల్‌లో 4, మంచిర్యాలలో 9 కేసులు నమోదు కాగా మంచిర్యాల కార్యాలయం ఏర్పడిన తర్వాత 13 మంది అధికారులు పట్టుబడడం విశేషం.

మంచిర్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గతంతో పోలిస్తే మంచిర్యాలలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు చేసిన తర్వాత వారి దూకుడు పెంచారు. పదినెలల కాలంలో మంచిర్యాలలో ఆఫీసు ఏర్పాటు చేసిన తర్వాత 13 మందిని వల పన్ని పట్టుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని కావాలంటే పైసలు లేనిదే ఫైళ్లు కదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు పైసలు డిమాండ్ చేస్తూ అధికారుల వలలో చిక్కుతున్నారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు లంచాలు తీసుకుంటూ దొరికిపోవడం జిల్లాకేంద్రంలో కలకలం రేపుతోంది. ప్రతీ ఆఫీసులో కొందరు అధికారులు పైసలు లేనిదే పనులు చేయమంటూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితులు అవినీతి నిరోదక శాఖ అధికారులను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఫిర్యాదు చేయాలంటే ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. అధికారులు వచ్చి వారిని ట్రాప్ చేయడంలో ఆలస్యం కావడంతో వారిని పట్టుకోవడంతో విఫలమయ్యేవారు.

● ప్రణాళికాబద్ధంగా దాడులు..

కానీ మంచిర్యా లలో కార్యాలయం ఏర్పాటు చేసిన తర్వాత మంచిర్యా ల జిల్లా కేంద్రంలో, జిల్లా పరిధిలో ఫిర్యాదు అందగా నే అధికారులు నిఘా ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుంటున్నారు. వారిని ట్రాప్ చేసి ఆధారాలతో అక్రమార్కులను కోర్టు ముందు నిలబెడుతున్నారు. వారికి శిక్ష పడేందుకు లంచాలు తీసుకునే సమయంలో ప్రత్యేక బృందాలతో ప్రణాళికాబద్ధంగా దాడులు చేస్తున్నారు. ఆధారాలను పకడ్బందీగా తీసుకుంటున్నారు. పట్టుకున్న సమయంలో ఆడియో, వీడియో రికార్డులు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. లంచం తీసుకున్న వారి ఆదాయం ఎంత, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయా అనే అంశాలు పరిగణలోకి తీసుకొని ఆధారాలుసేకరించి శిక్షలు పడేలా న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తుండడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. అయినప్పటికి కొందరు అధికారులు ఇవేమి పట్టించుకోకుండా బాధితుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు కావాలంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు విమర్శిస్తు న్నారు. పట్టుబడిన అవినీతి అధికారులకు శిక్ష పడితేనే లంచాలు తీసుకునే వారు భయపడతారని, దాడులు చేయడం వల్ల ఏ మార్పు ఉండదని, శిక్ష పడితేనే లంచాలు తగ్గుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

● ఈ నెల 25న సహకార సంఘాల డిప్యూ టీ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఓ ఉద్యోగి సస్పెన్షన్ ఎత్తివేత, పెండింగ్ జీతాలు చెల్లింపు కోసం రూ. ఏడు లక్షలు డిమాండ్ చేయగా ఐదు లక్షలకు ఒప్పుకొని రెండు లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రాథోడ్ బిక్కును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

● మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సర్వేయర్ మంజుల సర్వే చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో అసిస్టెంట్ ఉదయ్ ద్వారా బాధితుడు ఫోన్‌పే, క్యాష్ ద్వారా 26,500 రూపాయలను తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడులు చేసి పట్టుకున్నారు.

● మంచిర్యాల పట్టణం నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్షుద్రపూజల కేసులో ఎస్సై సుగుణాకర్ బాధితుడు ప్రభంజన్ రెండు లక్షల రూపాయలు కోర్టు డిపాజిట్ ఉత్తర్వులు వచ్చినప్పటికి రూ. 1,50,000 అతనికి ఇస్తున్నట్లు ఫొటోతీసుకొని డబ్బులు ఇవ్వలేదు. ప్రభంజన్ డబ్బులు అడగగా 50వేలు ఇస్తానని అనడంతో ఏసీబీ అదికారులను ఆశ్రయించగా ఎస్సై సుగుణాకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం కర్ణమామిడి గ్రామపంచాయతీ సెక్రెటరీ వెంకటస్వామి కోసం 20 వేల రూపాయలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు.

లంచాలు అడిగితే సమాచారం ఇవ్వండి..

జి మధు, ఏసీబీ డీఎస్పీ



ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు అడిగితే సమాచారం అందించాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ బాధితులకు న్యాయం చేస్తాం. చట్ట ప్రకారం వ్యవహరించడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలి. లేదా తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం నంబర్ 9440446106 ను సంప్రదించాలి. బాధితుడి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతాము. బాధితులు సహకరించినప్పుడే అవినీతి అధికారులను పట్టుకునే వీలుంటుంది. ఎవరికి భయపడకుం డా బాధితు లు తమకు ఫిర్యాదు చేయాలి.



నేడు 2కే రన్

తాండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కండక్ట్ ఫర్ యూనిటీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదారం పోలీసు క్రీడా ప్రాంగణం నుంచి 2కే రన్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందని, క్రీడాకారులు,యువకులు, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హాజీపూర్: ఏక్తా దివస్ సందర్భంగా హాజీపూర్ పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం 2-కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే రన్ పడ్తనపల్లి గ్రామంలోని విద్యారణ్య ఆవాస విద్యాలయ స్కూల్ గ్రౌండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, యువత, అధికారులు, క్రీడాకారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాసిపేట: కాసిపేట, దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ యూనిటీని విజయవంతం చేయాలని కాసిపేట, దేవాపూర్ ఎస్‌ఐలు ఆంజనేయులు, గంగారాంలు ఒక ప్రకటనలో తెలిపారు. కాసిపేట పోలీస్‌స్టేషన్‌పరిధిలోని సోమగూడెం సరస్వతి శిశుమందిర్ గ్రౌండ్ నుంచి దుబ్బగూడెం ఓల్డ్ టోల్‌గేట్ వరకు 2కే రన్ ఉంటుందన్నారు. దేవాపూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఆదాని సిమెంటు కంపెనీ మెయిన్ గేట్ వరకు 2కే రన్ ఉంటుందన్నారు. ప్రజలు, యువతీ, యువకులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భీమారం: భీమారంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆవడం క్రాస్ రోడ్డు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 2కే రన్ నిర్వహిస్తున్నామని సీఐ వేణుచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని యువతీ, యువకులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేలవాలిన ఆశలు

మంచిర్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరపిలేని భారీ వర్షం కురుస్తోంది. మొంథా తుపాన్ ప్రభావం కారణంగా బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం గురువారం కూడా కొనసాగింది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 42.4 మిల్లీమీటర్ల నగటు వర్ష పాతం నమోదైంది. గరిష్టంగా బెల్లంపల్లి మండలంలో 70.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా, జైపూర్ మండ లంలో 69.4 మిల్లీమీటర్లు, మంచిర్యాల జిల్లా కేంద్రం లో 68.6 మిల్లీమీటర్లు, హాజీపూర్ మండలంలో 64.8 మిల్లీమీటర్లు, నస్పూర్‌లో 58.0 మిల్లీమీటర్లు, చెన్నూరు మండలంలో మిల్లీమీటర్లు, భీమారం మండలంలో 45.6 మిల్లీమీటర్లు, వేమనపల్లి మండలంలో 44.0 మిల్లీమీటర్లు, కాసిపేట మండలంలో 41.2 మిల్లీ మీటర్లు, కోటపల్లి మండలంలో 34.2 మిల్లీమీటర్లు, తాండూరు మండలంలో 32.8 మిల్లీమీటర్లు,, కన్నెపల్లి మండలంలో 32.6 మిల్లీమీటర్లు, నెన్నెల మండలంలో 32.4 మిల్లీమీటర్లు, భీమిని మండలంలో 29.6 మిల్లీ మీటర్లు, మందమర్రి మండలంలో 29.0 మిల్లీమీటర్లు, లక్సెట్టిపేట మండలంలో 29.0 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.





- మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో జిల్లాలో భారీ వర్షాలు
- 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద
- 23 గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు విడుదల
- ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం
- మూడు వేల ఎకరాల్లో పంటలకు నష్టం

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద...

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గుడిపేటలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ మట్టం 148.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.43 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలుకాగా ప్రస్తుతం 18.591 టీఎంసీల నీరు ఉంది. ఎస్ఆర్ఎస్‌పీ నుంచి 5000 వేల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 36,680 క్యూసెక్కులు, స్థానికంగా కురుస్తున్న వర్షాల కారణంగా మరో 1,17,724 క్యూసెక్కుల నీరు ప్రస్తుతం ప్రాజెక్టులోకి చేరుతోంది. దీంతో 23 గేట్లు తెరిచి 2,04,404 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది.

ఓసీపీల్లో బొగ్గు తవ్వకాలకు ఆటంకం...

రెండు రోజులుగా ఎడతెరపి కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలకు కొంతమేర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఓబీ మట్టి తొలగింపు పనులు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. క్వారీల్లో నీరు నిలిచి పోవడంతో పనులు జరగడం లేదు. దీంతో యంత్రాల సహాయంతో నీటిని తోడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు..

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు

మిగతా 7వ పేజీలో..

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పత్తికి గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు వర్షాలకు నల్లబారిన పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐఎంల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ కారణంగా వర్షాలకు రైతులు పండించిన పత్తి నల్లబారిపోతుందన్నారు. దీన్ని సాకుగా చూసుకుని సీసీఐ సెంటర్లు పత్తినల్లగుందని, తేమ శాతం ఎక్కువ ఉందని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరిని కూడా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, బ్రహ్మానందం, శంకర్, సత్యం, చరణ్, సికిందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కళాశాలల బంద్ విజయవంతం

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన కళాశాలల బంద్ విజయవంతమైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డిగ్రీ, పీజీ, మెడికల్, ఒకేషనల్ కళాశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్ మాట్లాడుతూ స్కాలర్‌సీప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. వెంటనే వీటిని విడుదల చేయాలని లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హర్షవర్ధన్, ప్రదీప్, విష్ణుప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- డీఈవో యాదయ్య



విద్యార్థులను సన్మానిస్తున్న డీఈవో యాదయ్య

తాండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డీఈవో యాదయ్య సూచించారు. మండలంలోని రేచిని ప్రభుత్వ పాఠశాలను డీఈవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం క్రమం తప్పకుండా అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు రజిత, హర్షితను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మంల విద్యాధికారి మల్లేష్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రత్నయ్య, సతీష్‌కుమార్, రవిబాబు, కృష్ణగౌడ్, శ్రీలత, సకుమాంజలి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీల్వాయి ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి



వేమనపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కోటేశ్వర్‌ను రామగుండంకు బదిలీ చేశారు. ములుగు పోలీస్‌స్టేషన్ నుంచి జగదీశ్వర్‌రెడ్డి బదిలీపై నీల్వాయికి వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చెవులు మల్లేష్

హాజీపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెవులు మల్లేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడంతో విద్యారంగం నిర్వీర్యమవుతోందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. పది సంవత్సరాలు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేసిందని విమర్శించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వయోజన విద్యా జిల్లా అధికారి పురుషోత్తం

వేమనపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం సూచించారు. గురువారం వేమనపల్లిలో వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. వారికి చదువు నేర్పడానికి వలంటీర్లను నియమించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ గ్రామ సంఘం నుంచి ఇద్దరు వలంటీర్స్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ వలంటీర్లకు శిక్షణ ఇచ్చి గ్రామస్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి. ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సీఆర్‌పీలు తిరుమల, అమీన, డీఆర్‌పీలు సుమన్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

మందమర్రిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు నేలకొరిగిన వరి పొలాల నుంచి నీటిని పూర్తిగా తొలగించా లని, వరికొయ్యలను నిటారుగా లేపి కుచ్చులుగా కట్టుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల తెగుళ్ల ఆశించకుండా ధాన్యం నాణ్యతను కాపాడుకోవచ్చన్నారు. పంటల నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని పేర్కొన్నారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్ బుక్‌చేసుకుని పత్తిని విక్రయించాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు, రైతులు వెంకటేశం, నసీరుద్దీన్, షైపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

పాఠశాలలో స్వచ్ఛత పాటించాలి

జన్నారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని చింతగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో స్వచ్ఛత, పరిశుభ్రత పాటిస్తే రేటింగ్ విధానాన్ని పాటిస్తుందని దీని రేటింగ్‌లో 3శాతం ఎంపికైన ప్రతి పాఠశాలకు ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహం అందజేస్తుందన్నారు. వీటిని అనుసరిస్తూ ప్రతి పాఠశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, నర్సయ్య, రాజుకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హాజీపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపల్లి, నర్సింగా పూర్, నంనూర్ గ్రామాల్లోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఏ- గ్రేడ్ వరిధాన్యా నికి క్వింటాలుకు రూ.2389, బి-గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2369 ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. అధికారుల ఆదేశాలతో కేంద్రాలు ప్రారంభించారు కానీ ఇంకా కొనడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి ధాన్యం తడుస్తుందని, తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- డీఎంహెచ్‌వో అనిత - వెంకట్రావుపేట పీహెచ్‌సీ తనిఖీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

లక్సెట్టిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యులతో పాటు వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ అనిత సూచించారు. గురువారం లక్సెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆమె అకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్‌లో రోజువారీగా ఆరోగ్య వివరాలు పొందుపర్చాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలతో పాటు ఉప కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలపై అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అసంక్రమణ వల్ల వచ్చే వ్యాధులు, డయాబెటీస్, క్యాన్సర్‌తో పాటు ఇతర జీవనశైలితో వచ్చే వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త పడేలా చూడాలన్నారు. అంతేకాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వ్యాధులు సోకకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని రకాల వ్యాక్సిన్‌లు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.